
కథ



కథా నిలయం
శ్రీకాకుళం

# కామాక్షి లేచిపోయింది

గరిమెళ్ల శ్రీరామమూర్తి

సాయంత్రం ఆరుగంటలయ్యింది. రైల్వే కట్ట కింద రైస్ మిల్లు దగ్గర నుంచి టైర్లున్న రెండెడ్ల బండిని ముందుకు లాగి ఎద్దుల వీపు మీద ఒక్క చరుపు చరిచి ముందుకి నడిపించుకుంటూ వస్తున్నాడు, వెంకటేశు. రైలు కట్ట దిగి ఎద్దు బెదిరినట్టుంది, ఒక్క లాగు లాగి కుదేలై కూర్చుండిపోయింది.

ఎడ్లబండి వెనకాలే వస్తున్న సత్యం ఇది చూసి స్కూటరాపి వెంకటేశుతో, ''ఏరా వెంకటేశూ, దాపడెద్దు కొత్తగా కొన్నావా? అది ఇంకా అలవాటు కాలే. ఓ నిముసం గస తీర్చుకోనీ'' అన్నాడు.

''కాదు బావా, బెదిరింది. ఆపినానంటే మూడంకేసుద్ది.'' అని, ''నీయమ్మ లెగెహే'' అని ఎద్దుని ఒక దెబ్బ వేశాడు వెంకటేశు. బండి మొత్తం రోడ్డు పక్కకి లాగేసి అలాగే కూర్చుండిపోయింది ఎద్దు.

''ఎద్దు బెదిరిందా? అద్దరాత్రి, అపరాత్రి బండి లాగి ఉంటావు. సీకట్లో జడుసుకుందేమోరా'' అన్నాడు సత్యం.

''ఏమో అయినా ఈటికీ ఇట్టాంటియి ఉంటయ్యా'' అన్నాడు వెంకటేశు.

''ఏమో కాదెహే. నిజం సెప్పు. అల్ల బద్రం మేట్టారి గారమ్మాయి కామాచ్చిని అద్దరేత్రి పూట ఊరుదాటించేసినావని ఊరంతా గుప్పుమంటంది'' అడిగాడు సత్యం.

''పరాసికాలాడకెహే. అసలే కాల్తంది'' కోపంగా అని వెంకటేశు, అంతే కోపంగా బండిని ఒక్క గుంజు గుంజి, ఎద్దుని నిలబెట్టి బండిని ముందుకి పోనిచ్చాడు.

సత్యం ''మొరటు ఎదవ. ఈడు ఈ ఊళ్లో ఎవడితోటీ సవ్యంగా మాట్టాడ్డు'' అనుకుంటూ ఎడ్లబండి దాటుకుంటూ స్కూటరుపై వెళ్లిపోయాడు. ఊరి మొదట్లో రావి చెట్టు కింద స్కూటరు ఆపాడు. పక్కన కొద్ది దూరంలో ఉన్న బజ్జీల బండికేసి చూసి, ''ఒరే రామలూ, పిడత కింద పప్పు పెసల్‌గా సెయ్యరా'' అని చెప్పి, రావి చెట్టు మొదట్లో గచ్చు అరుగు మీద కూర్చున్నాడు.

అక్కడ అప్పటికే చంటిబాబు, కుంటి సత్తిగాడు, మీసాల అచ్చిబాబుగాడు, ఇంకా ఒకళ్లిద్దరు కూర్చుని కబుర్లాడుకుంటున్నారు. వాళ్ల మధ్యలో సత్యం కూర్చుని, ''ఈ మద్దెన ఎంకటేశుగాడు ఈడ కొత్తన్నాడేరా?'' కుతూహలంగా అడిగాడు.

"ఓర్నీయమ్మ. నువ్వు రోజుకోపాలి ఈడ కూకుంటావు గదా. నీకు తెల్దా?'' చుట్ట నవుల్తూ అన్నాడు కుంటిసత్తిగాడు.

''లేదురా. వడ్లు తోలకం కదా. రోజంతా ఆడికి ఆ పనే సరిపోద్ది. తెల్దేటి?'' అన్నాడు చంటిబాబు.

''నేనట్టా అనుకోడంలా. తప్పుసేసి నోడిలాగ ఎవడి కంటా పడకుండా తిరుగుతున్నాడనుకుంటా. పొద్దుటి మాట్లు ఒటేల్ కాడికి కూడా రాటల్లా రెండ్రోజుల్నించి'' డిటెక్టివ్‌లాగ సత్యం.

''అయితే ఏటంటావురా ఆడేటి సేసినాడు?'' కుతూహలంగా అన్నాడు చంటిబాబు.

'' మరదీ. తెలకపోతే తెల్దనండి. సెప్పింది నిజవో కాదో తేల్సుకోండి'' అని, ''ఏరా రావులూ, ఏటింకా సెయ్యలేదా'' అని బజ్జీల బండివాడి మీద కేకేశాడు సత్యం.

'' నాన్చక సెప్పెహే!'' అన్నాడు మీసాల అప్పిగాడు, దూరంగా పోతున్న రెండెడ్ల బండిని, దాని మీద పోతున్న వెంకటేశుని గుచ్చి గుచ్చి చూస్తూ.

''అదిగో సూసావేరా. ఆడిలాగేకదా పోతన్నాడు. కనీసం ఇటు తల తిప్పి సూసినాడా?'' తను చెప్పబోయే విషయం నూటికి నూరుపాళ్లూ నిజమే అనేంత నిక్కచ్చిగా చూశాడు సత్యం.

''ఏటిరా. ఆ సంగతి?'' మళ్లీ రెట్టించాడు మీసాల అప్పిగాడు.

''నిన్నట్నించి బద్రం మాట్టారింకి తాళవేసుందా?'' అడిగాడు సత్యం.

''దానికీ, ఈడికీ సంబంధంవేట్రా?'' అన్నాడు కుంటి సత్తిగాడు.

''సంబంధవా. సంబంధంన్నారా? ఆళ్లమ్మాయి కామాక్షి మూడ్రోజుల క్రితం అద్దరేత్రి కాణ్నుంచి ఊళ్లో కనపడతా లేదు. మర్నాటి నుంచి మేట్టారు, మేట్టారి పెళ్లాం కొంపకి తాళవెట్టి ఏడకో పోయి

...నారు. ఎందుకంటా?" అన్నాడు సత్యం.

"ఏమోరా, నేనూ విన్నా ఈ సంగతి. ఇయ్యాల మద్దినేల అన్నవెడుతూ మా యావిడ సెప్పింది ఈ ఊసు. కామాచ్చి ఎవురికీ సెప్పా పెట్టకుండా ఏడకో పోయిందంటరా. అమ్మలక్కలందరూ ఏదేదో మాటాడుకుంటున్నారని అంది. అయినా మా యావిడో తింగరిదిలే. ఏదో సెప్తే ఏదో అనుకుంటాది" అన్నాడు చంటిబాబు.

"ఒరే నాయనా, ఇవరం సెప్తా ఇను. కామాచ్చి సదూకుందికి భీమవరం పోతాందిగా. అద్నే ఎవడితోనో పేమలో పడ్డాది. మాట్టారు ఒప్పుకోరని సెప్పి ఆనూ పానూ సూసి, ఆడితో ఉడాయిం చేసింది. దాన్ని అద్దరాత్రి బండ్లో ఎక్కించుకొని భీమారంలో ఎంకటేసు గాడు దింపొచ్చాడు. ఇందాక ఆడు రైలు కట్ట కాడ కనపడ్డాళ్లే. ఎద్దు బెదురుతూందేరా అంటే అద్దరాత్రి అపరాత్రి పెయానాలుగా బావా. జడుసుకుందేమో అన్నాడు" అనేసి, బజ్జీల రావులు చేసిన పిడత కింద పప్పు తీసుకుందుకు బజ్జీల బండి దగ్గరకి లేచెళ్లాడు సత్యం.

"ఇది మరీ సిత్రంగా ఉంది. దానికి ఈడి బండే కావాలేంటి? ఏ ఆటో ఎక్కి అయినా ఎల్లిపోగల్దు కదా ఎల్లిపోవాలంటే" అన్నాడు మీసాల అప్పిగాడు.

"ఏట్రా నువ్వు తింగర నా కొడుకు బుర్ర ఎక్కడెట్టి మాట్టాడతన్నావు? ఆడి బండి ఊళ్లో ఏ టయాన తిరిగినా ఎవటూ పట్టించుకోడు. ఆడా మొరటు ఎదవ. సెప్పకూడదనుకున్నాడంటే హరి బ్రమ్మరుద్రాదులికి కూడా సెప్పడు. ఆ సంగతి ఊరంతా తెలుసు కదా. అదే ఇంకోటేదైనా అయితే, ఈ పాటికే మనకి తెల్సిపోయుండేదిగా?" నమ్మకంగా అన్నాడు కుంటి సత్తిగాడు.

"దీపాల వేళవుతోంది. సందలడిపోయింది. ఇంక ఇళ్లకి రారేంట్రా" అంటూ వచ్చాడు సురేష్.

"ఏరా సత్తిగా, నువ్వొక్కడివే తినేత్తన్నావు. ఈడ ఇంతమందిమి ఉన్నాం కనపడట్లా?" అంటూ లుంగీ పైకెత్తి బిగించి గచ్చుకి దగ్గరగా నిలబడ్డాడు.

"అయినా ఎంకటేసుగాడికీ, దీనికీ కనెచ్చనేంటిరా?" లా పాయింటు లాగాడు మీసాల అప్పిగాడు.

"ఓర్నీ కనెచ్చన్లేంటిరో? ఎంకటేసుగాడికి కూడా ఏవన్నా సెకండు సెటప్పా?" ఉత్సాహంగా అడిగాడు సురేష్.

"నీకు తెల్దేరా. కామాచ్చి అదేరా బద్రం మేట్టారి కామాచ్చి అదీ..." ఇంకా పూర్తి చేయలేదు కుంటి సత్తిగాడు.

"ఛీ.ఛీ.. కలికాలం! అదెక్కడ ఈడెక్కడరా. అయినా దానికి ఊళ్లో ఇంతమందిమి ఉన్నాం కనపళ్లా?" అన్నాడు సురేష్.

"ఇసయం అది కాదెహే! కామాచ్చి ఎవడితోనో లేచిపోయిందట. దాన్ని అద్దరాత్రి ఎంకటేసుగాడు బండి మీద దిగబెట్టినాడంట. ఆడు నేనే దిగబెట్టినానని మన సత్తిగాడితో సెప్పాడంట. ఆ ఇసయం ఈడ మాటాడుకుంటున్నాం" అన్నాడు సత్తిగాడు.

"ఓర్నీయమ్మ. నాకు ముందు నించే అనుమానవేరో. అది పదో క్లాసులోనే కోరసూపులు సూసేది. ఎంతందగత్తెరా. దానెనకాల పడనోడు ఈ ఊళ్లో ఎవడూ లేడు కదా. పోయి పోయి గళ్లో పడిందన్నమాట. దాన్ని సేసుకుంటానని మన నిడమర్రు పెసాదుగాడు ఈ మధ్య తెగూగిపోతున్నాడు. ఇంతకీ ఈ ఇసయం ఆడికి తెల్సో లేదో..." అంటూ సెల్ తీసి, ప్రసాద్‌కి ఫోన్ చెయ్యబోయాడు, సురేష్.

"ఉండ్రా. ఏ ఇసయవైనా నిద్దారించుకున్నాకే మాటాడాలి. తొందర పడకూడదు. సత్తిగాణ్ని రానీ, ఆణ్ని పూర్తి ఇవరాలడుగుదాం" అన్నాడు చంటిబాబు.

పిడత కింద పప్పు తింటున్న సత్యాన్ని చూస్తూ, ఫోన్ చెయ్యడం విరమించాడు సురేష్.

"... నాకు ముందు నించే అనుమానవేరో. అది పదో క్లాసులోనే కోరసూపులు సూసేది. ఎంతందగత్తెరా. దానెనకాల పడనోడు ఈ ఊళ్లో ఎవడూ లేడు కదా. పోయి పోయి గళ్లో పడిందన్నమాట. దాన్ని సేసుకుంటానని మన నిడమర్రు పెసాదుగాడు ఈ మధ్య తెగూగిపోతున్నాడు. ఇంతకీ ఈ ఇసయం ఆడికి తెల్సోలేదో..."

తినడం పూర్తి చేసి తిరిగి వాళ్ల దగ్గరకొచ్చాడు సత్యం. "ఉప్పెక్కు వేశాడు. ఉప్పగడ్డిలాగుంది. నోరు సెడిపోయిందెహే!" అని, "నేనెడ తానా ఇంక. ఇంటి కాడ పనుంది" అని చెప్పి స్కూటర్ స్టాండ్ తీశాడు.

"ఎల్లిపోతున్నావేంట్రా. కామాచ్చి సంగతి తెల్చు. నువ్వు సెప్పింది నిజమేనా?" అనుమానంగా అన్నాడు, మీసాల అప్పిగాడు.

"నాకు తెలిసింది సెప్పాను. నాకంతే తెలుసు. ఎల్తానింకో" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు సత్యం.

"ఇంకా ఏంట్రా అనుమానం? ఈడు ఊళ్లట్టుకు తిరిగేవాడు ఈడికి తెల్దా. ఈడేదైనా కరెట్టుగా మాటాడతాడు" అన్నాడు కుంటి సత్తిగాడు.

"రండెహే పోదాం, ఆకలేత్తంది. ఎవళ్లు ఎవళ్లతో లేచిపోతే మనకేంటి? మనకి తెలిత్తే మాత్రం కడుపు నిండేనా, కాలు నిండేనా?" అనుకుంటూ లేచి ఊళ్లోకి వెళ్లిపోయారు.

ఊరికి కిలో మీటరు దూరంలో రైల్వే కట్ట. దానికి ఫర్లాంగు దూరంలో శ్రీ విజయలక్ష్మీ రైస్ మిల్లు. ఈ చుట్టుపక్కల గ్రామాలకి అదొక్కటే రైస్ మిల్లు. దాని ముందు భాగంలో సాయంత్రం కుర్చీలేసుకుని మా ఊరి పెద్దమనుషులు కొంతమంది కూర్చుంటారు. సాయంత్రం కబుర్ల కాలక్షేపం, రాత్రి మందు కాలక్షేపం పూర్తి చేసుకొని, రాత్రి ఏ పదింటికో ఇళ్లకి చేరుకుంటారు. ఈ వేళ కూడా రొయ్యల చెరువుల రెడ్డిగారు, వ్యవసాయం, వడ్డీ వ్యాపారం చేసే వెంకట్రావు గారు, మిల్లు ఓనరు సత్యనారాయణగారు, అబ్బులు గారు కూర్చొని, కాలక్షేపం చేస్తున్నారు.

"అబ్బ! ఉక్కపోత దారుణంగా ఉంది య్యాల" చొక్కా పైగుండీ ఊడదీసుకుని ఉఫ్‌మని ఊదుకుంటూ అన్నాడు రెడ్డి.

"రొయ్యల సెరువు కాడ సల్లగా కూకు బైటకొత్తే నీకట్టాగే ఉంటదిలే" వెటకారమాడాడు అబ్బులు.

"రొయ్యలు పట్టేసేరా?" అడిగాడు మిల్లు ఓనరు సత్యనారాయణ.

"ఏ. ఓకేజీ పంపమంటావా?" అడిగాడు రెడ్డి.

"ఛీ ఛీ... సప్పగా ఉంటాయి. ఆట్ని ఫారినోల్లు ఎలా తింటారో గాని, మొన్నటి దాకా మట్టి కంపు కొట్టినట్టున్నాయి గదా" అడిగాడు సత్యనారాయణ.

"ఆc. అప్పట్నించే కదా సెరువులు దిగనాసిల్లాయి. ఏదో ఓ పాలి కాపోతే మరో పాలైనా రేటు రాపోద్దా అని పట్టుకు వేల్లాడుతున్నాను" మూల్గాడు రెడ్డి.

"కాలవలు కట్టేసినారేరా?" ఆరా తీసాడు అబ్బులు.

"ఆc. కట్టేసినారు. అందుకేగా ఉక్కపోతెక్కువైపోయింది" అని ఒక్క క్షణం ఆగి, ఈ సారి దాళవా మాసూళ్లు బానే అయ్యాయి. ముంగటేడు కంటే నయమే. మన ఎంకట్రావు పెద్ద పులైపోతాడు" హాస్యమాడాడు సత్యనారాయణ.

"ఏం పెద్ద పులో దీనెమ్మ, ఆడు హైద్రాబాదులో ఏం ఎలగబెడుతున్నాడో నాకైతే తెల్దు గాని, సదూ మీద సదూ తెగ సదివేత్తన్నానంటాడు. డబ్బుట్రా డబ్బుట్రా అని ఒకటే నస! ఎహె సదివింది సాలు ఊరికి దిగబడ్రా పింజారీ ఎదవా అని కూకలేద్దావంటే, మా యావిడ ఇంతెత్తున లేచుద్ది... ఉన్న ఒక్క కొడుకుని సదివించటానికి ఏడుత్తావేంటని. రూపాయలన్నీ ఆడెదాన పోయడానికే సాల్టల్లేదు" అన్నాడు వెంకట్రావు.

"ఓసోస్ ఏసవికాలం సెలవులు కూడా లేకుండా ఏటి సదివేత్తు

న్నాడు ఆడు? ఓ పాలి ఆడేటి సేత్తన్నాడో సూసిరా" అన్నాడు సత్యనారాయణ.

"మొన్నో పట్టు ఆడీడకొచ్చినపుడు బద్రం మేట్టారి కాడికి తీసుకు పోయి మాటాడించినా. అదేదో పెద్ద సదువే ఆడు సదూతున్నాడు, తొరగానే గొప్పోడైపోతాడు సదివించండి అని మేట్టారు సెప్పేడు" అన్నాడు వెంకట్రావు.

"మరింకేటి ఏడుత్తున్నావు డబ్బు పంపటానికి? మా సెల్లి సిందులే సిందంటే అందులో అర్థం ఉంది. నీ పితలాటకం ఆడి మీద సూపెట్టకు" హితవు సెప్పాడు రెడ్డి.

"అదే పోలే. బద్రం మేట్టారంటే గుర్తుకొచ్చింది. ఆరింటికి పది రోజుల్నించీ తాళాలేసున్నాయి. ఊళ్లో రకరకాలుగా సెప్పుకుంటున్నారు. ఆరు మనూరొచ్చి ఓ పదేళ్లవ్వద్దా?" అన్నాడు వెంకట్రావు.

"ఊర్లో సేనామందికి మంచి సెప్పి దార్లో పెట్టేటోడు, కూతుర్ని దార్లో పెట్టుకోలేకపోయాడు" అన్నారు అబ్బులు.

"ఎంకటేసు బండెక్కి ఉడాయించిందని అన్నారు. ఆణ్నడిగితే, రామ రామ నాకేటి తెల్దన్నాడు" అన్నాడు వెంకట్రావు.

"అసలినయం ఏంటంటే ఆ సందులో వోళ్లని ఎంక్వైయిరీ సేసిన దాన్ని బట్టి, ఓ రాత్రప్పుడు కామాక్షి పెట్టట్టుకుని, కంగారుకంగారుగా పన్నెండు గంటల పాసింజరు బండెక్కేసి ఎల్లిపోయినాదంట. బండంటే మనెదవ నాయాళ్లందరూ ఎంకటేసు గాడి రెండెడ్ల బండనుకున్నారు. అది సరే. ఆ మర్నాడు పొద్దుటి పూట ఏడు గంటలకు నిడదవోలు పాసింజరు బండెక్కి మేట్టారు, మేట్టారి పెళ్లాం ఎల్లిపోయారంట. ఎల్లా ఎల్లా మేట్టారి పెల్లాం ఒకటే ఏడుపంట. ఇదీ జరిగింది. పాపం మేట్టారికి గాని, మేట్టారి పెల్లానికి గాని ఆళ్ల కట్టం ఇదీ అని సెప్పుకోడం సేతగాదు. ఆళ్లే ఊరొదిలిపోకుండా ఇలా జరిగిందని మన్లో ఎవరికి సెపిఏనా, సాయంత్రానికల్లా దాన్ని, దాన్ని లేపుకుపోయినాణ్ని ఊళ్లోకి లాక్కు రామా?" మీసం దువ్వుకుంటూ అన్నాడు రెడ్డి.

"పిల్ల లెగిసిపోయింది సరే. ఈళ్లెందుకు ఊరొదిలిపోవడం? ముకం సూపెట్టలేకా? సరే, ఇప్పుడు పోయినారు. బళ్లు తీసినప్పటికైనా రావాలా? అప్పుడెట్టొత్తారు?" ఒక్క క్షణం ఆగి "ఇంతకీ ఆళ్లెక్కడికి పోయారు?" అడిగాడు అబ్బులు.

"ఇంతకీ అది నిజంగానే లెగిసి పోయిందంటావా?" అనుమానంగా అన్నాడు సత్యనారాయణ.

"నిజంగానా అని అడుగుతావా? వారం రోజుల క్రితం మన బాబిగాడికి భీమారంలో కనపడ్డాదంట. పక్కనెవడో ఉన్నాడంట. బాబిగాడు ఆళ్ల కాడికెళ్లే లోపు సందు మారిపోయారంట. నాకెందుకులే అని ఈడి మానాన ఈడు ఒచ్చేసాడు" చాలా ముఖ్యమైన సమాచారం అందించాడు రెడ్డి.

"మేట్టారికి ఫోన్ చేత్తే తెల్సిపోతాదిగా ఆళ్లెక్కడున్నారో?" అన్నాడు సత్యనారాయణ.

"ఆ బాగోతం కూడా అయ్యింది. మాట్టారి కొలీగు కోటేశ్వర్రావు మేట్టారు లేడా, ఆయన ఫోన్ చేత్తే మొదట రెండ్రోలూ సెల్లు మోగేది కాని ఎవరూ ఎత్తలేదంట. తరవాత నించి స్విచ్చి కట్టేసారు అని సెప్పేదంట. ఆరిక్కూడా ఈయనేవీ సెప్పలేదు" అన్నాడు రెడ్డి.

"కొంపతీసి ఎందులోనైనా దూకేరంటావా?" అనుమానంగా అబ్బులు.

"ఏదేవైనా గాని మాట్టారు స్కూళ్లు తెరిచేపాటికి ఈడకొత్తే ఊరు నించి ట్రాన్స్ఫర్ పెట్టుకుని పొమ్మని సెప్పాలి. లేదంటే గోదారికి ఎంత ఎదురీదితే పులసకి అంత రుసొచ్చినట్టు ఈ మాయదారి ముం... లు ఎంత బరితెగిత్తే, కుర్రనాయాళ్లు అంత మెచ్చేసుకొని ఆళ్లలాగే ఈళ్లూ మొదలెడతారు!" తేల్చేసాడు రెడ్డి.

"ఓ పాలి కోటేశ్వర్రావు మేట్టార్ని రమ్మను. ఈల్లకి ఎప్పుడు కావాలంటే అప్పుడు ట్రాన్స్ఫర్లుండవు. కౌన్సిలింగో, ఏటో ఉంటుంది. అదెప్పుడో కనుక్కుని, అవుసరమైతే ఓ పాలి మన ఎమ్మెల్యేతో కూడా మాటాడతాను" కంజాయింపుగా అన్నాడు సత్యనారాయణ.

"మేట్టారు ఈ టయానికి రైలు కట్ట కాడకొత్తారుగా? ఈవెనింగు వాకింగని ఇటేపే ఎల్తారు. కూసేపాగు ఈడకే పిలుద్దారి" అన్నాడు అబ్బులు.

"అడిగోనయ్యా మాట్టారు. కూడా ఎవడు... బద్రం మేట్టారు కదూ? ఈయ నెప్పుడొచ్చేరు ఊళ్లోకి?" అని, "ఒరే సూరిగా, మేట్టార్ల నిద్దర్నీ పిలుసుకురా!" పాలేర్ని పురమాయించాడు సత్యనారాయణ. "మేట్టారిలిద్దరికీ కుర్సీలట్రారా అప్పిగా!" అని వేరే పాలేరుకి పురమాయించాడు.

మాష్టార్లిద్దరూ వచ్చారు, సూరిగాడి కూడా.

"నమస్కారం మేట్టార్లూ కూకోండి. ఏటి బద్రం మేట్టారు బొత్తిగా నల్లపూసైపోయారు? సెప్పా పెట్టకుండా ఏడకెల్లి పోయారు?" ప్రశ్నలు గుప్పించాడు రెడ్డి.

కుర్చీలో స్తిమితంగా కూర్చున్నాక భద్రం మాష్టారు, "మా మావగారు కాలం చేశారు రెడ్డిగారూ... హార్ట్ ఎటాక్ వచ్చి. ఎటాక్ రాగానే భీమవరం హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసి, మా పెద్ద బావమరిది ఫోన్ చేశారు. రాత్రి పదకొండు గంటల వేళ. బావగారు కామాక్షిని చూడాలని అంటున్నారు నాన్న, వెంటనే పంపించండి అని. ఈ వార్త వినగానే మా ఆవిడ ఫెయింటై పడిపోయింది. ఎంతైనా కన్నతండ్రి కదా. అందునా ఈమె బీపీ మనిషి. ఇక అందరూ కలిసి వెళ్లే పరిస్థితి లేక, అంత అర్ధరాత్రి ఎవర్నీ ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, రాత్రి పన్నెండు గంటల పాసింజరు ట్రెయిన్‌కి మా అమ్మాయిని పంపించాను. మా చిన్న బావమరిదికి ఫోన్ చేసి భీమవం రైల్వేస్టేషన్‌లో రిసీవ్ చేసుకోమని చెప్పాను. ఇక మా ఆవిడ కొద్దిగా స్తిమితపడ్డాక, పొద్దుటే నిడదవోలు ట్రెయిన్‌కి మేమిద్దరం బయల్దేరి వెళ్లాం. పాపం మా మిసెస్‌కి వాళ్ల నాన్నగారి చివరి చూపు దక్కలేదు." ఒక నిముషం భారంగా ఆగి మళ్లీ ప్రారంభించారు భద్రం మాష్టారు. "మరుసటి రోజు నేనొక్కణ్నీ బయల్దేరివచ్చేద్దామనుకుంటే, శవాన్ని శ్మశానానికి తీసుకెళ్లినప్పుడు బంధువులు ఎవరున్నారో, వాళ్లు ధర్మోదకాలు పూర్తయ్యేదాకా వెళ్లడానికి కుదరదని చెప్పడంతో, నేను కూడా ఆగిపోవాల్సి వచ్చింది. ఇదుగో ఇవ్వాళ్ల పొద్దుట ధర్మోదకాలు అయ్యాయి. బయల్దేరి వచ్చాం" విచారంగా చెప్పారు, భద్రం మాష్టారు.

"ఫోన్ చేస్తే పలక్కపోతే మేవంతా గందరగోళపడ్డాం" అన్నాడు రెడ్డి.

"ఈ కంగార్లో ఫోన్ ఇంటి దగ్గరే మరిచిపోయాను" సంజాయిషీగా అన్నారు భద్రం.

"కనీసం కోటేశ్వర్రావుగారికైనా మీరు ఫోన్ చేసి ఉండాల్సింది. మేము కంగారుపడక పోదుము" నిష్ఠురంగా అబ్బులు.

"ఆc. అవును. కానీ వారమ్మాయి పెళ్లిచూపులు తొందరలో జరుపుతామని మాష్టారు అన్నారు. ఆ పరిస్థితుల్లో ఇలాంటి ఫోన్ చెయ్యడమెందుకులే అని..." అన్నారు బద్రం.

"పోనీ మాకెవరికైనా ఫోన్ చెయ్యొచ్చు కదా మాట్టారూ?" అన్నాడు అబ్బులు.

చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు భద్రం.

"ఏహే మేట్టారి బుర్ర తినకు. అసలే పుట్టెడు దుక్కంలో ఉన్నాడు" అని, "కొబ్బరి బొండాం తాగుతారా మేట్టారూ?" అన్నాడు సత్యనారాయణ.

"అబ్బే ఒద్దండి. ఇంకేంటి విశేషాలు?" అని ఒక నిముషం ఆగి, "సరే, మేం వెళ్తామండి" అని చెప్పి మాష్టార్లిద్దరూ లేచివెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లిన కొద్దిసేపటికి, "ఏ మాట కా మాటే సెప్పుకోవాలి. బంగారం లాంటి పిల్ల మీద ఎన్ని కారు కూతలు సేరు ఎదవ సన్నాసులు?" సర్దుకుంటూ అన్నాడు రెడ్డి.

"నిజవే. పిల్ల బంగారం! సర్లే, పిల్ల మీద ఏదైనా కీడుంటే దీంతో పోద్ది!"